క్లుప్తంగా

ఆదిత్యుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ రామారావు



రామారావు దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

అరసవల్లి: అరసవల్లిసూర్యనారాయణ స్వామి వారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబసమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారికి ఆలయ సిబ్బంది, అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భార్య, మాజీ ఎంపీపీ చామంతి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ తదితరులున్నారు.

మహిళా సంఘాల సభ్యులకు సన్మానం



మహిళా సంఘాల సభ్యులను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన లక్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన గ్రామైక్య సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అమలు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా వీఓఏ, మహిళా సభ్యులను సన్మానించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏసీ శ్రీరాములు, ఏపీఎం నారాయణరావు, సిబ్బంది పద్మ, వరదరాజులు ఉన్నారు.

పైపులైన్ లికేజీతో నీరువృథా



పైపులైన్ లీకవుతున్న దృశ్యం

సోంపేట: జింకిభద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని దేవాంగుల కాలనీ, బీసీ కాలనీల్లో జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసి పైపులైన్ లీకవుతోందని సర్పంచ్ తామాడ పద్మావతి తెలిపారు. దీంతో నీరు వృథా అవుతుందని చెప్పారు. పైపులైన్ లీకవుతుండడంతో జింకిభద్ర, బెంకిలి పంచాయతీలకు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

అదనంగా ఎరువులు సరఫరా చేయాలని వినతి

కంచిలి: మండల రైతాంగానికి అదనంగా డీఏపీ, పొటాష్ ఎరువును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. దీనిపై మంత్రి స్పందించి, తప్పనిసరిగా రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేసేలా అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు.


గొడుగులు వితరణ

పలాస: యాదవ కుల సంఘం పలాస మండల అధ్యక్షుడు, బొడ్డపాడు గ్రామానికి చెందిన జెస్సీ ఈవెంట్స్ మేనేజరు కిక్కర డిల్లీరావు యాచకులకు గొడుగులను ఆదివారం వితరణ చేశారు. అలాగే అన్నదానం చేశారు.

డీఈవో విచారణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటనపై డీఈవో తిరుమల చైతన్య విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం పాఠశాలకు వచ్చి సమస్యపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులపై ఆరా తీశారు. సిబ్బంది నుంచి రాతపూర్వకంగా వివరాలు తీసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని డీఈవో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కవిటి: బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2013లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికల్ని అందించి గౌరవించారు. గ్రూపు ఫొటోలు తీసుకొని ఆనందం వ్యక్తం చేశారు.



చట్టాలను కఠినతరం చేయాలి

ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది రక్షణకు కఠినతరమైన చట్టాలు ఉండాలి. ముఖ్యంగా మహిళా వైద్య, నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్న చోట్ల ఎటువంటి వేధింపులు లేకుండా చూడాలి. ఎక్కడైనా దాడులు, ఇతర సంఘటనలు జరిగితే అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుల్ని కఠినంగా శిక్షించాలి.

– డి.ఇంద్రజ, పీహెచ్‌సీ డాక్టర్, కె.కొత్తూరు, టెక్కలి మండలం



రక్షణ కరువైంది..

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్య సిబ్బందికి రక్షణ కరువయ్యింది. దేశవ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు తారసపడుతున్నాయి. వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో కనీస వసతులు లేకపోవడం మూలంగా మహిళా వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిపైన దేశవ్యాప్తంగా అవసరమైన చర్యలు తీసుకురావాలి.

–టి.సుజాత, స్టాఫ్ నర్సు, కంచిలి పీహెచ్‌సీ



రోగాల పంజా!

- జ్వరాలతో వణుకుతున్న జనం
- క్షీణించిన పారిశుద్ధ్యం
- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కంచిలి: బలియాపుట్టుగ కాలనీలో పేరుకుపోయిన చెత్త



కంచిలిలో జ్వరంతో బాధపడుతున్న రమణ



కంచిలి: పద్మతుల గ్రామ వైద్యశిబిరంలో చికిత్స చేస్తున్న మఠం సరియాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బి.వర్షిత

కంచిలి/ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం రూరల్, పలాస: సీజనల్ వ్యాధులు పంజా విసిరాయి. దీంతో జనం ఆస్పత్రుల పాలయ్యారు. పారిశుద్ధ్యం క్షీణించడంతోనే వ్యాధులు ప్రబలాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలతో పట్టణాలు, పల్లె ప్రాంతాలు వణుకుతున్నాయి. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో జ్వరాల తీవ్రత అధికంగా కన్పిస్తోంది. రోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వందల సంఖ్యలో జ్వరపీడితులు వైద్యం కోసం వెళుతున్నారు. అలాగే రోగులతో రక్త పరీక్షల కేంద్రాలు, ఆస్పత్రులు, మందుల దుకాణాలు నిండిపోతున్నాయి. ముఖ్యంగా వైరల్ జ్వరాలతో ప్రారంభమై రక్తపరీక్షలు చేసిన తర్వాత మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలుగా ధ్రువీకరించబడుతున్నాయి. కంచిలి మండలం జ్వరాల వ్యాప్తి అధికంగా కనిపిస్తోంది. మండల కేంద్రం కంచిలితోపాటు వివిధ గ్రామాల్లో జ్వరాలు వ్యాపించి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నెలలోనే నువాగడ గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పలువురు విద్యార్థులు మలేరియా బారిన పడటంతో జిల్లా మలేరియా అధికారి ఏకంగా వచ్చి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. రెండ్రోజులపాటు అక్కడ ప్రత్యేక క్యాంపులు పెట్టి విద్యార్థులు, గ్రామస్తులను పరీక్షించారు. తాజాగా అంపురం పంచాయతీ పరిధి పద్మతుల గ్రామంలో గుజ్జు లక్ష్మి(57)కు డెంగీ జ్వరం వచ్చినట్లు నిర్ధారణ అవ్వడంతో మఠం సరియాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బి.వర్షిత ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఫీవర్ సర్వే చేసి, యాంటీ లార్వా ఆపరేషన్‌ను చేపట్టారు. డెంగీ జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. మరోవైపు కంచిలి పీహెచ్‌సీలో రోజు జ్వరబాధితులు నమోదవుతున్నారు. వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర ఆధ్వర్యంలో జ్వరపీడితులకు చికిత్సలు అందిస్తున్నారు.



ఇచ్ఛాపురం: పట్టణ సీహెచ్‌సీలో వైద్యం కోసం వేచిఉన్న రోగులు

- చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. ఎక్కడ చూసిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.
- కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో పారిశుద్ధ్యం క్షీణించినప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.
- పారిశుద్ధ్య లోపంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.
- కాలువలు పూడికలతో నిండిపోవడంతో మురుగునీరు పారని పరిస్థితి ఉంది. దీంతో దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలుడానికి కారణమవుతున్నాయి.
- జ్వరాలు పట్టిపీడిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన వైద్య సేవలు అందడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు.



పలాస: బొడ్డపాడు కాలనీలో కాలువ దుస్థితి



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం అంగన్‌వాడీ కేంద్రం వెనుక చెత్త నిల్వలు



కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా గ్రామ మధ్యలో చెత్తకుప్ప



ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురంలో మురుగునీటిని చూపిస్తున్న బదకల దాలమ్మ



కాశీబుగ్గ: పలాస ఎర్రచెరువు దారిలో దుస్థితి..

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న యాజమాన్య ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం సాధన దిశగా అడుగులు వేయాలని విశ్రాంతి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కె.లీల అన్నారు. పూండిలోని సాయివినీత్ విద్యా సంస్థల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ విద్య ఉజ్వల భవిష్యత్‌కు పునాది అన్నారు. క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ చాపర కోదండరావు, డైరెక్టర్‌లు డాక్టర్ చాపర సాయివినీత్, పూజిత దేవి, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాష్, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీను, ధర్మారావు, జి.సాయి గోపాల్ ఉన్నారు.

ఘనంగా తులసి వనయాత్ర ర్యాలీ

కంచిలి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా తులసి వన యాత్ర ర్యాలీను హరే కృష్ణ హరే రామ నామ సంకీర్తనలతో మండల కేంద్రం కంచిలిలో ఆదివారం నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక శివాలయం నుంచి మఠం కంచిలి వరకు బరంపురం ఇస్కాన్ దేవాలయం వారితో కలిసి స్థానిక కృష్ణ భక్తులు చేపట్టారు. అనంతరం స్థానిక రాధాకృష్ణ ఆలయంలో చిన్నారులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఇస్కాన్ భక్తులతోపాటు స్థానికులు ఇప్పిలి కృష్ణారావు, కొల్లి ఈశ్వరరావు, సాలిన లక్ష్మణమూర్తి, బరంపురం నుంచి విచ్చేసిన ఇస్కాన్ దేవాలయం కమిటీ సభ్యుడు భువన మోహన్ దాసాజీ పాల్గొన్నారు. అలాగే మండలంలోని గోకర్ణపురం గ్రామంలో హరేరామ హరేకృష్ణ భజనను ఆదివారం నిర్వహించారు. బరంపురం ఇస్కాన్ దేవాలయం కమిటీవారు, స్థానిక ఇస్కాన్ భక్తులు సందర్శించారు.



కంచిలిలో తులసి వనయాత్ర ర్యాలీలో ఇస్కాన్ భక్తులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లఖపతి దీదీ సమ్మేళన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెలుగు ఏపీఎం జి.శ్రీనివాసరావు అన్నారు. దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన 'లఖపతి దీదీ సమ్మేళన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహిళ సమైఖ్య కార్యాలయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళ సంఘాల సభ్యులు వీక్షించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. స్వయం శక్తి సంఘాల సభ్యులకు ప్రయోజం కలిగించేందుకు, వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దటానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. అనంతరం మహిళ సంఘాల సభ్యులకు చెక్‌లు, సర్టిఫికెట్లను అందించారు. వెలుగు సీసీలు ధనలక్ష్మి, మంగమ్మ, ఉష, ప్రేమిల, హైమావతి ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు కోరారు. పలాస రైల్వే మైదానం జగన్నాథస్వామి ఆలయం ప్రాంగణం వద్ద ఉత్సవ ఏర్పాట్లను కమిటీ సభ్యులు ఆదివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గం శ్రీకృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలు ఉదయం7.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారన్నారు.

ధనలరాజులమ్మకు ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారికి ఎదుట మొక్కుబడులు తీర్చుకున్నారు.

నేడు రక్తదాన శిబిరం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కార్మిక భవన్‌లో సోమవారం ఉదయం పది గంటలకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని కాష్యూ, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆ నలుగురు' ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో ఔత్సాహికులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు: వెంకటపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణశాఖ సౌజన్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ మరడ భాస్కరరావు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెగిన విద్యుత్ తీగలు!

పలాస: మండలంలోని మామిడిపల్లిలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు తెగి నేలపై పడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే బొడ్డపాడు లైన్‌మెన్ సంతు తన సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకొని తీగలను సరి చేసి సరఫరాను పునరుద్ధరించారు.

సీతమ్మతల్లి ఆలయంలో చోరీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ మున్సిపాలిటీ పెదంచల రోడ్డుకు ఆనుకొని ఉన్న పలాస సీతమ్మ తల్లి దేవాలయంలో దొంగలు పడ్డారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఆలయం తలుపులను వేసేసి అర్చకులు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం పూజలు నిర్వహించేందుకు వెళ్లేసరికి తలుపులకు వేసిన తాళాలు విరగొట్టి ఉండటాన్ని గుర్తించారు. లోనికి వెళ్లి చూడగా హుండీలు సైతం పగలగొట్టి ఉండటాన్ని గమనించి చోరీ జరిగినట్టు భావించారు. హుండీలో ఉన్న పది వేల రూపాయలకు పైగా నగదును దొంగలు పట్టుకుపోయినట్టు అర్చకులు ఇప్పిలి శ్రీనివాస్ తెలిపారు. చోరీపై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది సంఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 12వ వార్డు పరిధి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ నుంచి అప్పయ్యదొర రోడ్డు మార్గం వర్షాలతో పాడైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న 12వవార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి తన స్వంత నిధులతో రోడ్డును మరమ్మతులు చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పోతనపల్లి హరిప్రసాద్ ఉన్నారు.

ముకుందా..ముకుందా..



టెక్కలి: రోటరీనగర్ సత్యసాయి శాంతి సుధా మందిరంలో జన్మాష్టమి వేడుకలు



టెక్కలి:సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న చిన్నారులు



సోంపేట: జింకిభద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యప్రదర్శన



టెక్కలి: ఉల్లాసంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు



సోంపేట: రాధాకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆదివారం జరుపుకున్నారు. పిల్లలు రాధాకృష్ణ, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టికొట్టే సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆబాలగోపాలులంతా ఒకేచోట చేరి మురిపించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. టెక్కలి రోటరీనగర్‌ని సత్యసాయి శాంతి సుధా మందిరంలో జరిగిన వేడుకలు ఆకట్టుకున్నాయి. – సాక్షి నెట్ వర్క్

ఇచ్ఛాపురం కళాకారులకు సత్కారం



ధనుంజయరెడ్డిని సత్కరిస్తున్న తెలుగు సంస్కృతి సాహితీ సంస్థ సభ్యులు, మంత్రులు



సత్కారం పొందుతున్న లింగమూర్తిరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రలో సంగీత కచేరీలు నిర్వహిస్తూ, జానపద కళలను పరిరక్షిస్తున్న తిప్పన ధనుంజయరెడ్డి, పరపటి లింగమూర్తిలను హైదరాబాద్ రవీంద్ర భారతీలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇచ్ఛాపురం మండల కేంద్రంగా శ్రీమహతి సంస్కృతి సేవ సంస్థ ద్వారా కళలకు ప్రాణం పోస్తూ, వాటిని గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో పరిచయం చేస్తున్న ధనుంజయరెడ్డి, పరపటి లింగమూర్తిలను తెలుగు సంస్కృతి సాహితీ సేవా సంస్థ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు మెమెంటోలు అందజేసి సత్కరించారు. సన్మాన గ్రహీతలను మహతి సంస్కృతిక సేవా సంఘ సభ్యులు, ఎంపీపీ బోర పుష్ప, ఇచ్ఛాపురం నియోజకవర్గ కళాకారులు అభినందించారు.